## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ వలంటీర్ మృతి



వలంటీర్ రాము (ఫైల్)

**అగనంపూడి:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వలంటీర్ గొంతిన రాము (42) శుక్రవారం మృతి చెందారు. 79వ వార్డు లంకెలపాలెం వార్డు సచివాలయ వలంటీర్ రాము ఆదివారం సొంత పనిమీద అగనంపూడి వెళ్లి, తిరుగు ప్రయాణంలో ఆటోలో వస్తుండగా అగనంపూడి ఫ్లైఓవర్ వద్ద ఆటో నుంచి ఆమె జారి పడిపోయారు. ఈ సంఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాము మృతిపై వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

### నిత్యావసర సరకుల పంపిణీ



సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

**అగనంపూడి:** జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసకు చెందిన నిరుపేద కుటుంబానికి సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నెలకు సరిపడా బియ్యం, పప్పులు, నూనె ఇతర వంట సామగ్రిని అందించారు. కాలనీకి చెందిన సంతోషి భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె ఇద్దరు పిల్లలతో ఆర్థి ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ట్రస్ట్ ప్రతినిధులు నెలకు సరిపడా సరుకులు అందించారు. ఉక్కు అధికారి కె.కామేశ్వరి తన తల్లి లక్ష్మి జ్ఞాపకార్థం వీటిని అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, గౌరవ సలహాదారు పట్టా రామ అప్పారావు ప్రతినిధులు పాల్గొన్నారు.

### విద్యాశాఖ మంత్రిని కలిసిన యూనిట్ టీం

**అక్కిరెడ్డిపాలెం:** సమగ్ర శిక్ష అభియాన్‌లోని పార్ట్ టైం టీచర్లను ఒకేషనల్ టీచర్లుగా మార్పు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారని జిల్లా యూనిట్ టీం అధ్యక్షుడు రవిచంద్ చెప్పారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. 23 శాతం జీతం పెరుగుదల జీవో విడుదల చేసిన సందర్భంగా ఆయనతో పాటు యూనిట్ టీం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శంకర్, జిల్లా యూనిట్ టీం కార్యదర్శి కె.శ్రీనివాసరావు మంత్రిని కలిసి ధన్యవాదాలు చెప్పారు. ఉపాధ్యాయుల మిగిలిన అంశాలు కూడా త్వరలో పరిష్కరిస్తామని మంత్రి చెప్పినట్లు రవిచంద్ తెలిపారు.


### 'సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి'

**అగనంపూడి:** కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, లేదా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. 88వ వార్డు వెదుళ్లనరవలో పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతన పెంపు ఉత్తర్వులు జారీ చేయాలని, మట్టి ఖర్చులు రూ.20వేలు, పదవీ విరమణ సయమంలో రూ.75వేలు చెల్లించేలా ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ, సంధ్య, చొప్పా అప్పారావు, శ్రీధర్, నాయుడు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కనులపండువగా అప్పన్న నిత్యకల్యాణం

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.







# స్వయం ఉపాధికి చేయూత



ఆర్థిక స్వావలంబన దిశగా అతివల అడుగులు

కుటుంబానికి సహాయ సహకారాలు

మెరుగుపడుతున్న జీవన ప్రమాణాలు

**నాలుగేళ్లలో 'వైఎస్సార్ చేయూత'లబ్ధి**

| సంవత్సరం | లబ్ధిదారులు | నగదు పంపిణీ |
|---|---|---|
| 2020-21 | 13,061 | రూ.27,92,03,536 |
| 2021-22 | 13,644 | రూ.29,43,60,388 |
| 2022-23 | 14,326 | రూ.29,60,09,902 |
| 2023-24 | 15,063 | రూ.31,12,29,000 |
| నాలుగు విడతల్లో లబ్ధిదారులకు అందజేసిన నగదు | | రూ.118,08,02,826 |

**గాజువాక :** మహిళా సాధికారతే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వారు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అందులో భాగంగా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఇప్పటికే నాలుగు విడతల్లో మంజూరైన రూ.75 వేలతో ఎందరో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి, కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

రాష్ట్రంలో 45 నుంచి 60 ఏళ్లలోపు వయస్సున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించింది. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చిన జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేశారు. ఇప్పటివరకు ఒక్క గాజువాక నియోజకవర్గంలోనే రూ.118.08 కోట్లను నేరుగా 45 నుంచి 60 ఏళ్లలోపు వయసున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు అందజేశారు.

మహిళలు ఈ నగదును ఉపయోగించుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. ఈ పథకంలోనే లబ్ధిదారుల్లో అనేకమంది వ్యాపారాలను ప్రారంభించుకుని ఆర్థికంగా సొంతకాళ్లపై నిలబడ్డారు. కొంతమంది కిరాణా దుకాణాలు, మరికొంతమంది టిఫిన్ సెంటర్లు, ఇంకొందరు కూరగాయల దుకాణాలను ప్రారంభించి, తమ కుటుంబాలకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు.

### కిరాణా దుకాణం నడుపుతున్నా..



నా భర్త త్రిమూర్తులు ఆటో నడుపుతారు. ఆయనకు వచ్చే ఆదాయం అంతంత మాత్రమే కావడంతో మాకు ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మాకు చేయూత పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. నాలుగు విడతల్లో రూ.75వేలు వచ్చాయి. ఈ డబ్బుతో నేను మా ఇంటివద్దే చిన్న కిరాణా దుకాణం ప్రారంభించాను. రోజుకు రెండు వేల రూపాయల వరకు వ్యాపారం సాగుతోంది. దీంతో నేను మా కుటుంబానికి ఆర్థికంగా సహాయపడుతున్నాను. ఎంతో సంతృప్తిగా ఉంది.

– సూర్యకాంతం, దువ్వాడ సెక్టార్–1

### 'చేయూత'తో వ్యాపార వృద్ధి



నా భర్త వెల్డర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో నేను 2014లో ఒక బడ్డీని ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తూ వచ్చాను. బడ్డీలో సరకులతో రోజుకు రెండు వేల రూపాయలవరకు వ్యాపారం జరిగేది. దీంతో పెద్దగా లాభం కూడా కనిపించేది కాదు. బడ్డీలో సరకును పెంచుకోవడానికి మా దగ్గర పెట్టుబడి లేదు. ఈ తరుణంలో నాకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 అందింది. దీంతో నా బడ్డీని కిరాణా దుకాణంగా మార్చుకున్నాను. తర్వాత కూడా అందిన నగదుతో పెట్టుబడికి లోటు లేకుండా ఉంటోంది. ప్రస్తుతం రోజుకు ఐదారు వేల రూపాయల టర్నోవర్ చేయగలుగుతున్నాను. సొంత వ్యాపారం చేసుకుంటున్నానన్న సంతృప్తి లభించింది. నాకు పెట్టుబడి కోసం వైఎస్సార్ చేయూత పథకాన్ని అందించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– సేనాపతి రమణమ్మ, డ్రైవర్స్ కాలనీ

### 'లిప్'తో విద్యాప్రమాణాల పెంపు



అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో ఐఎఫ్‌పీపై పాఠ్యాంశాల బోధనను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

**అక్కిరెడ్డిపాలెం:** పాఠశాలల్లో విద్యార్థులు బోధనపై ఏ విధంగా అవగాహన పెంచుకుంటున్నారో తెలుసుకునేందుకు ప్రతీ పాఠశాలల్లో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్(లిప్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంఈవో విశ్వనాథం అన్నారు. ఈ కార్యక్రమం విద్యా ప్రమాణాల పెంపునకు దోహదపడుతుందన్నారు. 68వ వార్డు మింది, అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో 6,7,8 తరగతులకు నిర్వహించిన లిప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో లిప్ ప్రోగ్రామ్ ద్వారా బోధన మరింత అభివృద్ధి చెందేవిధంగా సలహాలు, సూచనలు ఇచ్చారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు అగనంపూడి, అక్కిరెడ్డిపాలెం, మింది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.కృష్ణారావు, ఎం.ఎల్.ఎస్.కాంతం , పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, ఉపాధ్యాయులు కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పీవీకి భారతరత్న.. తెలుగు జాతికి దక్కిన గౌరవం

**అగనంపూడి:** దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం తెలుగు జాతికి దక్కిన గౌరవమని ఆలిండియా బ్రాహ్మణ సంఘం చైర్మన్ యమిజాల రాంజీ, రాష్ట్ర సమన్వయకర్త ధర్మాల వ్యాసశర్మ ప్రకటనలో పేర్కొన్నారు.ప్రధానిగా భారతదేశ కీర్తి పతాకను అంతర్జాతీయ స్థాయిలో ఎగరవేసిన పీవీని దేశంలో అత్యున్నత పురస్కారమైన భారతరత్నతో గౌరవించడంపై హర్షం వ్యక్తం చేశారు.

## రూ. 53. 30 లక్షలతో రోడ్లు, కల్వర్టుల నిర్మాణం

73వ వార్డులో పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి శంకుస్థాపన



శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ సుజాత

**గాజువాక :** జీవీఎంసీ 73వ వార్డులో రూ.53.30 లక్షలతో చేపట్టనున్న నూతన రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ముందంజలో ఉన్నారన్నారు. వీధి కుళాయిల నుంచి ఎలక్ట్రికల్ పనుల వరకు ఆమె దగ్గరుండి పర్యవేక్షించడం అభినందనీయమన్నారు. ఇప్పటివరకు ఈ వార్డులో వివిధ పనుల కోసం జీవీఎంసీ నుంచి రూ.12.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ఇదే వేగంతో అభివృద్ధి పనులు కొనసాగడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలని కోరారు. సుజాత మాట్లాడుతూ రూ.15 లక్షలతో కై లాసనగర్‌లో నూతన రోడ్డు, కల్వర్టు మరమ్మతు పనులు, రూ.19.30 లక్షలతో సింహగిరి కాలనీ జంగాల వీధిలో నూతన రోడ్డు నిర్మాణం, రూ.19 లక్షలతో సింహగిరి కాలనీ మదర్ థెరిసా ఆర్చివద్ద నూతన రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భూపతిరాజు శ్రీనివాసరాజు, కె.పి.నాయుడు, సత్యంరెడ్డి, వి.రామకృష్ణరాజు, ఆదిలక్ష్మి, అలీ, కిరణ్, సంతోష్, వరలక్ష్మి, మంజుల, డి.ఎస్.ఎన్.రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీతో మరింత మెరుగైన వైద్యం



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను అందిస్తున్న సమన్వయకర్త చందు తదితరులు

**పెదగంట్యాడ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు(చందు) అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదల వైద్యం కోసం ఖర్చు పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25 లక్షల కు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రు ల్లో మరింత మెరుగైన వైద్యం అందుతుందన్నారు. జీవీఎంసీ 76వ వార్డు రామచంద్రనగర్ సామాజిక భవనం వద్ద కొత్తగా మంజూరైన ఆరోగ్య శ్రీ కార్డులను వార్డు నాయకుడు దొడ్డి రమణతో కలసి శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలోనే ప్రజల ఆరోగ్యం కోసం ఎన్నో చర్యలు చేపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా, సంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు షావుకారి శరత్, కుమార్, ప్రమీల, మూర్తి, వాకాడ అచ్యుత్‌రెడ్డి, రమేష్ , కె.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

### ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



లంకెలపాలెం హైస్కూల్‌లో విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు



పెదముషిడివాడ హైస్కూల్లో విద్యార్థికి మాత్ర వేస్తున్న సిబ్బంది

**అగనంపూడి:** నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 79, 85 వార్డుల్లోని అగనంపూడి, లంకెలపాలెం, పినమడక, లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. ఈ సందర్భంగా లంకెలపాలెం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉంటే పిల్లలు అనారోగ్యం బారిన పడతారన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వాడడం వల్ల నులిపురుగులు మృతి చెంది, పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని చెప్పారు. కార్యక్రమంలో సుధాకర్, విజయలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## 1093వ రోజుకు 'ఉక్కు' దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1093వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతూపోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## నేటి నుంచి హిందీ పరీక్షలు

**తగరపువలస:** దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించే లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలు శని, ఆదివారాల్లో భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో జరుగనున్నాయి. రెండు రోజుల పాటు హయ్యర్ పరీక్షలతో పాటు వైవా జరుగగా ఆదివారం లోయర్ విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు గాను పూర్తిగా ఏర్పాట్లు చేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు ఎం.తిరుమల శ్రీదేవి తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు కూడా పంపిణీ చేశారు.

### తిరుమల నగర్‌లో జెడ్సీ పర్యటన

- అసోసియేషన్ ప్రతినిధులకు ప్రశంసలు



పార్కులో కంపోస్ట్ పిట్ పరిశీలిస్తున్న జెడ్సీ ప్రసాదరావు

**కూర్మన్నపాలెం:** జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్‌లో జోన్–6 జోనల్ కమిషనర్ ప్రసాదరావు శుక్రవారం పర్యటించారు. కాలనీలోని స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించిన ఆయన అసోసియేషన్ ప్రతినిధులు చేస్తున్న కృషిని అభినందించారు. ముఖ్యంగా కమ్యూనిటీ కంపోస్ట్, టెర్రస్ గార్డెన్, ఇంకుడు గుంతలు, చెత్త విభజన, హోం కంపోస్ట్, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడం, పార్కులు, ఇల్లు, అపార్ట్‌మెంట్ గోడలపై అవగాహన పెయింట్స్, ఖాళీ స్థలంలో గార్డెన్ పెంపకం తదితర అంశాలను పరిశీలించిన ఆయన కాలనీవాసులను ప్రశంసించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, వార్డు సెక్రటరీ సంధ్య, మేస్త్రీలు మూర్తి, శ్రీను తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు పాల్గొన్నారు.

### చెట్టును ఢీకొన్న బైక్.. ఒకరు మృతి

**కూర్మన్నపాలెం:** బైక్ అదుపు చేయలేక చెట్టుకు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివీ.. కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన చింతలపాటి మోహన్‌కుమార్(33) పరవాడలోని ఠాగూర్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం జనరల్ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లిన మోహన్ అనారోగ్యం కారణంగా మధ్యాహ్నం అనుమతి తీసుకుని ఇంటికి తిరిగి వచ్చేశాడు. రాత్రి స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. తిరిగి అర్ధరాత్రి సమయంలో అగనంపూడి నుంచి రాజీవ్‌నగర్ వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో తాను నడుపుతున్న బైక్‌ను అదుపు చేయలేక చెట్టును ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనలో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుల ద్వారా సమాచారం అందుకున్న భార్య స్రవంతి.. భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఐదు నెలల పాప ఉంది.

### భైరవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

**సింహాచలం:** అమావాస్య పురస్కరించుకుని శుక్రవారం భైరవవాకలోని భైరవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4గంటల నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ నెలకుంది. స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయానికి వెళ్లే రెండు కిలోమీటర్ల మేర ఉన్న మార్గమంతా భక్తులతో రద్దీగా మారింది.

### విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



బ్యాగ్‌లతో విద్యార్థులు

**అగనంపూడి:** నాంది ఫౌండేషన్ సౌజన్యంతో లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 50 మంది బాలికలకు బ్యాగ్‌లు, జామెట్రీ బాక్స్‌లు, నోట్ పుస్తకాలు, శానిటరీ నాప్‌కిన్లు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ నాంది ఫౌండేషన్ బాలికల విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత పెంపు



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న 'కోరమాండల్' ప్రతినిధులు, ఉపాధ్యాయులు



సోలార్ సిస్టమ్‌ను ప్రదర్శించిన విద్యార్థులు



కరెన్సీ, నాణేలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**అక్కిరెడ్డిపాలెం:** వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయవచ్చని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ డి.రాజీవ్ అన్నారు. ఈ నెల 28న సైన్స్ డే ను పురస్కరించుకుని మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్స్ డే ను పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సైన్స్ డే రోజు కోరమాండల్ కంపెనీలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించి, అత్యుత్తమ ప్రాజెక్ట్ ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో సోలార్ సిస్టమ్, హైడ్రాలిక్ ప్రెజర్, హైడ్రో ఎలక్ట్రిసిటీ తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాటిని విద్యార్థులు చక్కగా వివరించారు. 1947వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు భారతదేశ కరెన్సీ, నాణేలతో పాటు 87 దేశాలకు చెందిన కరెన్సీ, నాణేలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ ఇంజినీర్లు అజయ్, ఖుషీ, పాఠశాల హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, ఉపాధ్యాయులు బి.హెచ్.వి.ఎస్.ఎస్.ఎ.త్రినాథరావు, కె.సుజాత, ఎం.శంకరరావు, ఎ.సింహాచలం నాయుడు, డి.దేవానంద్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 16న సమ్మె విజయవంతం చేయాలి



ఆటోనగర్‌లో రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపు వద్ద ఆందోళన చేస్తున్న సిటూ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

**అక్కిరెడ్డిపాలెం:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సిటూ జిల్లా కమిటీ సభ్యుడు జగ్గునాయుడు కోరారు. ఆటోనగర్‌లోని రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్ షాపు ఎదుట సిటూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో కార్మిక వర్గం, పేదలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నరేంద్ర మోదీ ధనికులకు లక్షల కోట్లు ఆదాయాన్ని సమకూర్చే విధంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్ షాపు కంపెనీలో 500 కార్మికులు పని చేస్తున్నారని, వారికి ఈఎస్ఐ, ఈపీఎఫ్, సేఫ్టీ పరికరాలు, సమాన పనికి సమాన వేతనం వంటివి అమలు చేయలేదన్నారు. సిటూ జిల్లా కమిటీ సభ్యుడు రాంబాబు, అవతారం, రాజు, వెంకటేశ్వరరావు, సురేష్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

**అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో..**

**ఉక్కునగరం:** దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఉక్కు కార్మిక నాయకులు కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి ఏఐటీయూసీ పాయింట్ వద్ద శుక్రవారం నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని, అధిక ధరలు తగ్గించాలన్న డిమాండ్లపై దేశవ్యాప్తంగా జరుగుతున్న బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, కర్రి దాలినాయుడు, జె.రామకృష్ణ, సన్యాసిరావు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

### కోదండ రామాలయాన్ని సందర్శించిన టీటీడీ బృందం

**సబ్బవరం:** మండలంలోని గుల్లేపల్లిలో పునర్నిర్మిస్తున్న కోదండ రామ ఆలయానికి విగ్రహాలను తిరుమల తిరుపతి దేవస్థానం సమకూర్చనుంది. దీనిలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఇన్‌స్పెక్షన్ కమిటీ, హిందూ ధర్మప్రచార పరిషత్ విశాఖ క్లస్టర్ సూపరింటెండెంట్ ఎస్‌కేసీఎం శర్మ, పండితులు చల్లా సత్యనారాయణతో కూడిన కమిటీ నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని శుక్రవారం పరిశీలించారు. వారితో పాటు గ్రామ పెద్దలు ఉన్నారు.